సాక్షి కామారెడ్డి

మంగళవారం । 7 । నవంబర్ । 2023



డిపాజిట్లు గల్లంతే..

కామారెడ్డిలో ప్రతిపక్షాలకు డిపాజిట్లు గల్లంతవడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు.

- IIIలో ▸



సైనికుల్లా పనిచేయాలి

ఎన్నికలలో గెలుపుకోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ నేత సుభాష్ రెడ్డి కోరారు.

-- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6 /19.4

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి పొగ మంచు కురుస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'అభ్యర్థులకు సహకారం అందించాలి'



కామారెడ్డి క్రైం: నామినేషన్ పత్రాలు నింపడంలో అభ్యర్థులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల నామినేషన్, అఫిడవిట్ దాఖలు, స్వీకరణలలో అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు ఫారాలు నింపడంలో, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంలో పూర్తి సహకారం అందించాలని సూచించారు. పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, తహసీల్దార్ లత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.65 లక్షల అల్ప్రాజోలం పట్టివేత



కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సోమవారం ఉదయం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరున్నర కిలోల అల్ప్రాజోలం పట్టుకుని ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం తెలిపారు. కామారెడ్డి ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన అంబరి రమేష్ గౌడ్ 6.30 కిలోల అల్ప్రాజోలం తీసుకొని సోమవారం కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో నిర్మల్ ఏరియాకు చెందిన వ్యక్తి కోసం ఎదురుచూస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గతంలో అంబరి రమేష్ గౌడ్ ఓ ల్యాబ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడని తెలిపారు. ఆ అనుభవంతో అల్ప్రాజోలం తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేవాడు. అందులో భాగంగా సోమవారం నిర్మల్‌కు చెందిన లింగేశ్‌ను రప్పించి, ఆ ఏరియాకు తరలించేందుకు సిద్ధమవుతుండగా అధికారులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.65 లక్షల వరకు ఉంటుందన్నారు. వీటితో పాటు రెండు బైకులను సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గతంలో కేసులు ఉన్న వారిని సైతం బైండోవర్ చేస్తున్నామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ కుమార్ పాల్గొన్నారు.

వీఐపీ సెగ్మెంట్!

- కామారెడ్డిలో సీఎం, పీసీసీ చీఫ్‌ల పోటీ
- బీజేపీనుంచీ బలమైన అభ్యర్థి
- ప్రచారానికి తరలిరానున్న ప్రముఖులు
- అందరి దృష్టి ఈ నియోజకవర్గంపైనే..



బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పోటీ చేస్తుండడంతో కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం వీఐపీల సెగ్మెంట్‌గా మారింది. బీజేపీ సైతం బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపడంతో పోటీ రసవత్తరంగా సాగుతోంది. దీంతో రాష్ట్ర ప్రజల దృష్టి కామారెడ్డి నియోజకవర్గంపై కేంద్రీకృతమైంది. ప్రముఖుల పోటీతో ఆయా పార్టీల నేతలు, శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది.

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన వ్యక్తులు కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండడంతో రాజకీయం వేడెక్కింది. సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రధాన ప్రత్యర్థులుగా బరిలో నిలుస్తుండడంతో రాష్ట్రమంతా కామారెడ్డివైపు చూస్తోంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి బరిలో ఉన్నారు. ఆయన చాలాకాలంగా జనంలో ఉన్నారు. బీజేపీలో చేరికలపై ఫోకస్ చేశారు. వెంకటరమణారెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఆయన తరపున ప్రచారం చేయడానికి పార్టీకి చెందిన ప్రముఖులు వచ్చే అవకాశాలున్నాయి.

9న కేసీఆర్ నామినేషన్, సభ

బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ గురువారం నామినేషన్ వేస్తారు. అనంతరం పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా నుంచి డిగ్రీ కాలేజీ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అక్కడ జరిగే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు. సభకు భారీగా జనాన్ని సమీకరించేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. ఇటీవల రెండు రోజులపాటు మాచారెడ్డి, కామారెడ్డి పట్టణం, దోమకొండ, భిక్కనూరు మండల కేంద్రాల్లో నిర్వహించిన సభల్లో కేటీఆర్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ఇంటికొకరు సభకు తరలిరావాలని ఆయన కోరారు. అంతేకాక జన సమీకరణకు సంబంధించి బూత్ కమిటీల ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగించారు. సభకు మంత్రి కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.

10న రేవంత్ నామినేషన్, సభ

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 10న నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదే రోజు జిల్లా కేంద్రంలో బీసీ డిక్లరేషన్ కోసం భారీ బహిరంగ సభకు ప్లాన్ చేశారు. ఈ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య హాజరవుతారని పార్టీ నాయకులు తెలిపారు. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నేతలు, శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉంది. కాగా రేవంత్‌రెడ్డి పోటీ చేస్తుండడంతో ఆయన ముఖ్య అనుచరులు వేం నరేందర్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి తదితరులు కామారెడ్డిలో మకాం వేస్తున్నారు. వారు ఎన్నికల బాధ్యతలను చూసుకుంటారని తెలుస్తోంది. కామారెడ్డిలో జరుపతలపెట్టిన బీసీ డిక్లరేషన్ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనాన్ని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బీజేపీ వల్లే తెలంగాణకు నిధులు



అరుణతారను గెలిపించాలని కోరుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

- రెండుసార్లు అబద్ధాలు చెప్పి గెలిచిన బీఆర్ఎస్
- జుక్కల్‌లో అరుణతార గెలుపును ఎవరూ ఆపలేరు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మద్నూర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వల్లే తెలంగాణలో అభివృద్ధి కోసం నిధులు వచ్చాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. బీజేపీ జుక్కల్ అభ్యర్థి అరుణతార సోమవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. అనంతరం గురు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కోసం కేంద్రం నిధులు ఇస్తుంటే.. తామే నిధులు ఇస్తున్నామని బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కేసీఆర్ తుంగలో తొక్కారన్నారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. దళిత బంధు రావాలంటే బీఆర్ఎస్ నాయకులకు సగం డబ్బులు ఇవ్వాల్సి వస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని ఆరోపించారు.

జుక్కల్‌లో అరుణతార గెలుపును ఎవరూ ఆపలేరని డీకే అరుణ పేర్కొన్నారు. నామినేషన్ వేయడం కోసం వచ్చిన అరుణతారను ఆశీర్వదించడానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, అభిమానులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో రావడాన్ని చూస్తుంటే జుక్కల్‌లో బీజేపీ ఘన విజయం సాధించడం తథ్యమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నీ సుగ్గి బందయ్యే సమయమొచ్చింది

''బీఆర్ఎస్ ఎమ్మెల్యే సింధేకు టైం దగ్గర పడింది. ఆయన సుగ్గి(కూలి) బందయ్యే సమయం వచ్చింది'' అని అరుణతార పేర్కొన్నారు. సుగ్గి కోసం అరుణతార వచ్చారన్న సింధే వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. ''నేను సుగ్గికి రాలేదు.. నీ సుగ్గి బంద్ చేయడానికే వచ్చా'' అని పేర్కొన్నారు. ప్రజలు ఈసారి ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ కులకర్ణి, నాయకులు కిష్టారెడ్డి, హన్మండ్లు, శ్రీరాం, ప్రసంజీత్ కాలే, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

డీకే అరుణకు ఘన స్వాగతం



నిజాంసాగర్: జుక్కల్ అభ్యర్థి అరుణతార నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి డీకే అరుణ హెలీకాప్టర్‌లో వచ్చారు. ఆమెకు బిచ్కుందలోని దడ్గి రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి మద్నూర్‌కు వాహనాలలో ర్యాలీగా వెళ్లారు.

సీఎంను ఓడించడానికి సన్నద్ధం కావాలి

- రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- అధిష్టానం ఆదేశాల మేరకే నిజామాబాద్‌కు వెళ్తున్నా
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఓడించేందుకు పార్టీ కార్యకర్తలందరూ సన్నద్ధం కావాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనకు కామారెడ్డితో 34 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఇక్కడినుంచి వెళ్లడానికి బాధగా ఉన్నా అధిష్టానం ఆదేశాల మేరకు నిజామాబాద్ అర్బన్‌లో పోటీ చేస్తున్నానన్నారు. 9వ తేదీన నిజామాబాద్‌లో నామినేషన్ వేస్తానన్నారు.

లక్షమందితో సభ..

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 10న కామారెడ్డిలో నామినేషన్ వేస్తారని షబ్బీర్ అలీ తెలిపారు. ఆ కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య పాల్గొంటారన్నారు. రేవంత్‌రెడ్డి నామినేషన్ అనంతరం కామారెడ్డిలో లక్ష మందితో సభ నిర్వహించి బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామన్నారు. లిక్కర్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం జైలులో ఉన్నారని, అదే కేసులో ఎమ్మెల్సీ కవితను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో బీజేపీ నేతలు చెప్పాలని డిమండ్ చేశారు. కామారెడ్డిలో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న వెంకటరమణారెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అమ్ముడు పోయి విత్‌డ్రా అయ్యారని ఆరోపించారు. కామారెడ్డిలో కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్తలుగా మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డిలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెండు జిల్లాల డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, మానాల మోహన్‌రెడ్డి, జెడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, పట్టణ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, నాయకులు పండ్ల రాజు, శ్రీనివాస్, ఇంద్రకరణ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చందు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

- మూడో జాబితా విడుదల
- కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి, బాన్సువాడలో ఏనుగు..
- జుక్కల్ టికెట్టు లక్ష్మీకాంత్‌రావ్‌కు..
- నిజామాబాద్ అర్బన్ అభ్యర్థిత్వం షబ్బీర్ అలీకి కేటాయింపు

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాలుగు స్థానాలనుంచి బరిలో నిలిచేవారి పేర్లను సోమవారం ప్రకటించింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తొమ్మిది నియోజకవర్గాలు ఉండగా.. తొలి రెండు జాబితాలలో ఆర్మూర్, బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి అభ్యర్థులను ఖరారు చేసిన విషయం తెలిసిందే. మిగతా స్థానాలకు సోమవారం అభ్యర్థులను ప్రకటించింది. ప్రచారంలో ఉన్నట్లే కామారెడ్డి బరిలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఇక్కడినుంచి పార్టీ టికెట్టు ఆశించిన షబ్బీర్ అలీకి నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని కేటాయించారు. బాన్సువాడ టికెట్టు ఏనుగు రవీందర్‌రెడ్డికి, జుక్కల్ టికెట్టు తోట లక్ష్మీకాంతరావ్‌కు కేటాయిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం జాబితా విడుదల చేశారు.

బాన్సువాడ నుంచి పోటీ చేయడానికి పలువురు నేతలు ఆసక్తి చూపారు. అయితే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఢీకొట్టేందుకు బలమైన అభ్యర్థిని దింపాలని భావించిన పార్టీ.. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే గంగారాంతోపాటు తోట లక్ష్మీకాంత్‌రావ్ టికెట్టు ఆశించినా అధిష్టానం లక్ష్మీకాంత్‌రావ్‌వైపే మొగ్గు చూపింది.

గంగారాం నిర్ణయం ఏమిటో?

కాంగ్రెస్ టికెట్టు కోసం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం తీవ్రంగా ప్రయత్నించారు. టికెట్టు దక్కకపోవడంతో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న విషయమై నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది. పార్టీపై తిరుగుబాటు జెండా ఎగురవేస్తారా లేక అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పార్టీ గెలుపుకోసం కృషి చేస్తారా అన్న విషయమై పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

జుక్కల్ నియోజకవర్గం




అభ్యర్థి పేరు : తోట లక్ష్మీకాంత్‌రావ్

భార్య: అర్చన తోట

విద్యార్హత: ఎంఏ, పీహెచ్‌డీ

రాజకీయ ప్రస్థానం: తొలిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్నారు.

బాన్సువాడ నియోజకవర్గం



అభ్యర్థి పేరు : ఏనుగు రవీందర్‌రెడ్డి

భార్య : మంజులారెడ్డి. ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

స్వగ్రామం : తాడ్వాయి మండలంలోని ఎర్రాపహడ్

రాజకీయ ప్రస్థానం:

- 2004లో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.
- తెలంగాణ కోసం 2008లో రాజీనామా. ఉప ఎన్నికలలో కాంగ్రెస్ చేతిలో ఓటమి.
- 2009లో తిరిగి ఎమ్మెల్యే.
- 2010లో తెలంగాణ కోసం మరోసారి రాజీనామా. ఉప ఎన్నికల్లో విజయం.
- 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం.
- 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి. తరువాత బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిక.
- ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిక. బాన్సువాడ అభ్యర్థిత్వం ఖరారు.

నిజామాబాద్ అర్బన్



అభ్యర్థి పేరు : షబ్బీర్ అలీ

భార్య : నఫీస్ పర్వీన్

కొడుకు : ఇలియాస్, ఇద్దరు కూతుళ్లు

రాజకీయ ప్రస్థానం :

- 1987 లో మాచారెడ్డి ఎంపీపీగా పోటీ చేసి ఓటమి చెందారు.
- 1989లో కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలుపు. అప్పటి మర్రి చెన్నారెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.
- 1994, 1999 ఎన్నికలలో ఓటమి.
- 2004 గెలుపు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో విద్యుత్తు శాఖ మంత్రి.
- 2009 ఎన్నికలతో పాటు 2014, 2018 ఎన్నికల్లోనూ ఓటమి. శాసన మండలి సభ్యుడిగా ఎన్నిక, మండలిలో విపక్ష నేతగా బాధ్యతలు.
- 2023 ఎన్నికలలో నిజామాబాద్ అర్బన్ అభ్యర్థిత్వం ఖరారు.

జిల్లాలో 14 నామినేషన్లు..

కామారెడ్డి క్రైం: జిల్లాలో సోమవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా కామారెడ్డిలో 12 నామినేషన్లు వేశారు. జుక్కల్, ఎల్లారెడ్డిలలో ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు వచ్చాయి. కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి తరఫున ఆ పార్టీ కౌన్సిలర్లు, ధర్మ సమాజ్ పార్టీనుంచి ఉగ్రవాయి భోలేశ్వర్, ఎంఐఎం నుంచి షేక్ అబ్దుల్ వహీద్, బీఎస్పీ అభ్యర్థి ఉర్దావర్ సురేష్ గౌడ్ నామినేషన్లు వేశారు. ఇండిపెండెంట్లుగా మడిశెట్టి తిరుపతి రెండు సెట్లు, కంజర్ల మహేందర్‌రెడ్డి, గరిడె వెంకటరావు(పౌల్ట్రీ రైతు), మంగిపల్లి భార్గవి, కళారం అశోక్ వర్ధన్ (పౌల్ట్రీ రైతు), బర్గెల శివ, కంటే సాయన్న ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. జుక్కల్‌లో బీజేపీ అభ్యర్థి అరుణతార, ఎల్లారెడ్డిలో స్వతంత్ర అభ్యర్థిగా గాంధారి మండలం మాతుసంగెంకు చెందిన సంజీవులు నామినేషన్లు వేశారు.

నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలో 12 నామినేషన్లు దాఖలయ్యాయి. బాల్కొండలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, బోధన్‌లో బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. బాన్సువాడలో కాంగ్రెస్ నాయకులు కాసుల బాల్‌రాజ్, కాసుల రోహిత్, స్వతంత్ర అభ్యర్థి పట్ట భాస్కర్ నామినేషన్లు వేశారు.



డీకే అరుణతో కలిసి నామినేషన్ పత్రాలు అందిస్తున్న జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతార



బాల్కొండలో నామినేషన్ వేస్తున్న మంత్రి వేముల



బోధన్‌లో బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలో గురుకుల విద్యార్థి ప్రతిభ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి యాసిన్ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ద్వితీయ బహుమతిని సాధించాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని అధ్యాపకులు అభినందించారు.

బీఆర్ఎస్‌లో దిద్దుబాటు చర్యలు

- మాచారెడ్డి జెడ్పీటీసీ ఇంటికి కేటీఆర్
- జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి

సాక్షి, కామారెడ్డి: పార్టీలో దిద్దుబాటు చర్యలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చర్యలు చేపట్టారు. ఆయన సోమవారం సాయంత్రం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్‌రెడ్డి, నాయకులు తిమ్మయ్య గారి సుభాష్‌రెడ్డి, తోట ఆగయ్య, ఎంజీ వేణుగోపాల్ గౌడ్, చీటి నర్సింగరావు తదితరులతో కలిసి కామారెడ్డిలోని జెడ్పీటీసీ రాంరెడ్డి ఇంటికి వచ్చారు.

ఇటీవల బూత్ కమిటీలతో ఎన్నికల ప్రచారంపై సమీక్ష సందర్భంగా మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీటీసీ రాంరెడ్డి మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఇద్దరు నేతల మధ్య రాజీ కుదర్చడానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో స్వయంగా కేటీఆర్ రంగంలోకి దిగారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని హైదరాబాద్ తిరిగి వెళ్తూ కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్‌లోగల జెడ్పీటీసీ రాంరెడ్డి ఇంటికి వచ్చి మాట్లాడారు. జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చినట్టు సమాచారం. ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని మంత్రి ఆయనకు సూచించారు. మంత్రి జోక్యంతో వివాదం సమసినట్టేనని భావిస్తున్నారు.



కామారెడ్డిలో జెడ్పీటీసీ రాంరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

ఎలాంటి దురుద్దేశాలు లేవు..

జిల్లాకేంద్రంలో ఈనెల 3న జరిగిన మాచారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో అనుకోని చిన్న సంఘటన చోటు చేసుకుందని పార్టీ కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఎలాంటి దురుద్దేశాలు లేవన్నారు. సోమవారం రాత్రి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ నేతలు తిర్మల్‌రెడ్డి, నర్సింగరావు, ముజీబొద్దీన్, నిట్టు వేణుగోపాల్‌రావ్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ సంఘటనపై పార్టీలో చర్చించామని, మంత్రి కేటీఆర్ జెడ్పీటీసీ రాంరెడ్డి, ఎంపీపీ నర్సింగరావులతో మాట్లాడారని పేర్కొన్నారు. పార్టీలో అందరూ కలిసి పనిచేస్తారని వివరించారు. తన కళ్ల ముందే జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నట్టు ఎంపీపీ నర్సింగరావు పేర్కొన్నారు. అందరం కలిసి పనిచేసి సీఎం కేసీఆర్‌ను మంచి మెజారిటీతో గెలిపిస్తామన్నారు.

ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

మాచారెడ్డి వైస్ ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి, మంథని దేవునిపల్లి సర్పంచ్ అరవింద్‌లను పార్టీనుంచి సస్పెండ్ చేస్తున్నట్లు షేరి సుభాష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నియమావళికి విరుద్ధంగా, క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించినందుకుగాను ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీతో పాటు అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ యాదగిరి హెచ్చరించారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు సోమవారం యూనివర్సిటీ యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులను శారీరక, మానసిక, లైంగిక, ఒత్తిడికి గురిచేస్తే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తెయూ యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, వైస్ చైర్మన్‌గా రిజిస్ట్రార్ యాదగిరి, కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, సభ్యులుగా అధ్యాపకులు కె రవీందర్‌రెడ్డి, ఎంబీ భ్రమరాంబిక, జి బాలకిషన్, ఎ పున్నయ్య, గుల్ ఈ రానా, మహేందర్ ఐలేని, కె కిరణ్మయి, కిరణ్ రాథోడ్‌ను నియమించారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు స్థానచలనం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, విజయలక్ష్మి స్థానచలనం పొందారు. సాయాగౌడ్ పరీక్షల నియంత్రణ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయలక్ష్మి సారంగపూర్ బీఈడీ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశాల మేరకు విజయలక్ష్మిని పరీక్షల నియంత్రణ విభాగానికి, సాయాగౌడ్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు బదిలీ చేశారు. సోమవారం వీరు బాధ్యతలు చేపట్టారు.

కామర్స్‌లో కాత్యాకు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగంలో పరిశోధకురాలు వడ్డేపల్లి కాత్యా పీహెచ్‌డీ సాధించారు. తెయూ కామర్స్ డీన్ జి రాంబాబు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ ఆన్ కస్టమర్ రిటెన్షన్ అండ్ సాటిస్‌ఫాక్షన్ ఇన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా- ఏ స్టడీ' అనే అంశంపై కాత్యా పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. సోమవారం తెయూలో నిర్వహించిన ఓపెన్ వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రవికుమార్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, డీన్ రాంబాబు, అధ్యాపకులు శ్రీనివాస్, శ్వేత, గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం



రాజు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చక్రధర్‌నగర్ తండాకు చెందిన బదావత్ రాజు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. రాజు చెవిటి, మూగవాడు. సైగలతోనే ఇతరుల భావాలను అర్థం చేసుకుంటాడు. అక్టోబర్ 30న ఇంట్లో నుంచి వెళ్లిన రాజు తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీడీ కార్మికులే కీలకం

- తమవైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ ప్రణాళిక
- జిల్లాలో బీడీ కార్మికులు 2.75 లక్షలకు పైమాటే..
- జీవన భృతి అందుకుంటున్న కార్మికులు, టేకేదార్లు 98,837 మంది



మోర్తాడ్(బాల్కొండ) : జిల్లాలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా మహిళలు ఆధారపడింది బీడీ పరిశ్రమపైనే. బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఆసరా పథకం కింద జీవన భృతిని అందిస్తుండగా లబ్ధి పొందుతున్న కార్మికులను తమవైపు తిప్పుకునే పనిలో అధికార పార్టీ అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ప్రతి నియోజకవర్గంలో 20వేల మందికి మించి బీడీ కార్మికులు జీవన భృతిని అందుకుంటుండటంతో వారి ఓట్లు గంపగుత్తగా తమ పార్టీకే వచ్చేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బీడీ కార్మికులతో పాటు వారి కుటుంబ ఓట్లు రాబట్టుకుంటే గెలుపు నల్లేరు మీద నడకేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించే విషయంలో బీడీ కార్మికుల ఓట్లు కీలకం కావడంతో ప్రతి కార్మికురాలిని అధికార పార్టీ నాయకులు స్వయంగా కలుసుకుని ఓట్లు రాబట్టుకునే పనిలో ఉన్నారు. జిల్లాలో బీడీ పరిశ్రమను నమ్ముకుని దాదాపు 2.75లక్షల మంది కార్మికులు ఉన్నారు. వీరిలో బీడీలు చుట్టేవారు ఎక్కువ మంది ఉంటే బీడీ కంపెనీల్లో పని చేసే మగవారు తక్కువ మంది ఉన్నారు. జీవనభృతి మాత్రం బీడీలు చేసేవారికి, టేకేదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్యాకర్లు, బట్టీ కార్మికులకు గతంలో ఇచ్చినా మళ్లీ రద్దు చేశారు.

జీవనభృతి అందుకుంటున్న బీడీ కార్మికులు	
ఆర్మూర్ నియోజకవర్గం	21,637
బాల్కొండ	28,044
నిజామాబాద్ రూరల్	26,421
బోధన్	10,768
నిజామాబాద్ అర్బన్	7,031
బాన్సువాడ	4,322
టేకేదార్లు	614
మొత్తం	98,837

భృతి పొందని వారు వేలల్లో..

బీడీ భృతి పొందని కార్మికుల సంఖ్య ప్రతి నియోజకవర్గంలో 15 వేలకు మించి ఉంది. పీఎఫ్‌కు కటాఫ్ తేదీ ఎత్తివేసిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో అనేక మంది బీడీ కార్మికులకు జీవన భృతి అందడం లేదు. ఇప్పుడు జీవన భృతికి నోచుకోని వారికి ఎన్నికల తర్వాత ఎలాగైనా మంజూరు చేయిస్తామని అధికార పార్టీ నాయకులు హామీ ఇస్తున్నారు. బీడీ కార్మికుల ఓట్లను ఏకపక్షంగా రాబట్టుకుంటే తమ గెలుపు సులభం అని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా జీవన భృతికి నోచుకోని కార్మికులను ప్రసన్నం చేసుకుంటే తమకే ఆ ఓట్లు పడతాయని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆశిస్తున్నారు. ఏదేమైనా అభ్యర్థుల గెలుపు ఓటములను బీడీ కార్మికులు ప్రభావితం చేసే స్థాయికి ఎదగడం ఎలాంటి మార్పుకు అవకాశం ఇస్తుందో వేచి చూడాల్సి ఉంది.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



మద్నూర్‌లో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న బీజేపీ అభ్యర్థి అరుణతార, బీజేపీ నేత డీకే అరుణ

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. సోమవారం బాన్సువాడలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి భుజంగరావు తెలిపారు. కాంగ్రెస్ నేతలు కాసుల బాలరాజ్, కాసుల రోహిత్, స్వతంత్ర్య అభ్యర్థి పట్ట భాస్కర్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి తరఫున కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో బీజేపీ కౌన్సిలర్లు శ్రీకాంత్, నరేందర్, శ్రీనివాస్‌లు నామినేషన్ దాఖలు చేశారు. మద్నూర్ తహసీల్ కార్యాలయంలో బీజేపీ అభ్యర్థి అరుణతార ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో కలిసి వచ్చి రిటర్నింగ్ అధికారి మనుచౌదరికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానానికి తొలి నామినేషన్ సోమవారం దాఖలైంది. గాంధారి మండలం మాతుసంగం గ్రామానికి చెందిన మ్యాదరి సంజీవ్ స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ప్రభాకర్‌కు నామినేషన్ పత్రాలను అందించారు. అలాగే జుక్కల్ అసెంబ్లీ స్థానానికి మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం ఈ నెల 9న నామినేషన్ వేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ కౌన్సిలర్లు



ఎల్లారెడ్డిలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సంజీవ్

నిరుద్యోగుల తరఫున నామినేషన్లు



కామారెడ్డిలో మాట్లాడుతున్న టీయూపీఈటీఏ ప్రతినిధులు

కామారెడ్డి క్రైం: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల వివక్ష చూపించిందని టీయూపీఈటీఏ రాష్ట్ర అధ్యక్షుడు మాదగోని సైదులుగౌడ్ ఆరోపించారు. అందుకే నిరుద్యోగులు, ప్రైవేటు పీఈటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో నామినేషన్లు వేస్తామన్నారు. సోమవారం కామారెడ్డిలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ తరఫున కామారెడ్డిలో భార్గవి నామినేషన్ వేశారని తెలిపారు.

రాష్ట్రంలో ఉద్యోగాలు నోటిఫికేషన్లు లేవని, నోటిఫికేషన్ వస్తే కోర్టు కేసులతో తాత్సారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో 616 గురుకుల పీఈటీ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇచ్చి పరీక్షలు పెట్టారని, నియామకాలు చేపట్టకుండా కోర్టు కేసులను సాకుగా చూపిస్తూ అభ్యర్థులను ప్రభుత్వం దగా చేసిందన్నారు. గతంలో ఎన్నో సార్లు టీఎస్‌పీఎస్సీ, అసెంబ్లీ, ప్రగతిభవన్‌లను ముట్టడించామన్నారు. అయినప్పటికీ ఏవరూ స్పందించడం లేదన్నారు. అందుకే నామినేషన్లు వేస్తున్నామని తెలిపారు.

ప్రతిపక్షాలకు అభ్యర్థులు దొరకడం లేదు

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



రాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

పిట్లం(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదని, బీజేపీ పార్టీ వారు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారిని, కాంగ్రెస్ వారు సంగారెడ్డి జిల్లాకు చెందిన వారిని జుక్కల్ నియోజకవర్గంలో పోటీ చేయించాలని చూస్తున్నారని జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన సోమవారం బొల్లక్‌పల్లి, మద్దెలచెరువు, బండపల్లి, గౌరారం తండా, కోమటిచెరువుతండా, గౌరారం, రాంపూర్, కుర్తి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులను చాలా చేసుకున్నాం.. ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయి.. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే మిగతావి కూడా పూర్తి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలోని దళితులందరికీ దళిత బంధు పథకం వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాంపూర్‌లో పలువురు ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, మండల రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మదన్‌మోహన్ రావు

గాంధారి/ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గాంధారి మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్, వెల్లుట్ల, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన, కార్యకర్తలను కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



నిజామాబాద్‌నాగారం: సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి రూరల్ గేమ్స్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14, 19 విభాగంలో ఖోఖో, కబడ్డీలో జిల్లా బాలుర జట్టు ప్రథమస్థానం, అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. క్రీడాకారులను రూరల్ గేమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్బాగోని అశోక్‌గౌడ్, భాస్కర్, బుస్స మహేష్, దత్తు అభినందించారు. ఈ జట్టుకు కోచ్‌లుగా చందు, రంజిత్, మేనేజర్‌గా పుష్పలత వ్యవహరించారు.

స్వేదం చిందించే వారికే రైతుబంధు ఇవ్వాలి

రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



కామారెడ్డి డిగ్రీ కాలేజీ మైదానంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలమైందని రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. సోమవారం ఉదయం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో వాకర్స్‌తో ఆయన మాట్లాడారు. మట్టిని నమ్ముకుని, ఆరుగాలం స్వేదం చిందించే రైతులకు రైతుబంధు ఇవ్వాల్సిందిపోయి, సినిమా హీరోలు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన డబ్బులతో వందల ఎకరాలు కొనుగోలు చేసిన బడాబాబులకు రైతుబంధు వస్తోందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యారంగం బాగుపడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తే ప్రభుత్వం మన ఊరు మన బడి ప్రోగ్రాం ప్రకటించిందని, గత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. తాము ఏ పార్టీకి వ్యతిరేకం కాదని, ఏ పార్టీనీ సమర్థించడం లేదన్నారు. అయితే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. 35 లక్షల మంది నిరుద్యోగులు సఫర్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదని, స్విస్ బ్యాంకుల్లో అక్రమ సొమ్మును తెప్పిస్తానని మాట తప్పిందన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

డెంగీ సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ప్రోగ్రాం అధికారి రాజు



బతుకమ్మ కుంటలో సర్వే చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: పట్టణంలో డెంగీ వ్యాధి సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి రాజు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారులకు జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలని సూచన చేశారు. ఎప్పటికప్పుడు ఏఎన్‌ఎంల సహకారంతో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడి సిబ్బందికి సూచించారు. వైద్య శాఖ అధికారులు చలపతి, తదితరులున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో గోదావరి పుష్కర ఘాట్ వద్ద సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. పుష్కర ఘాట్ వద్ద 35 నుంచి 40 ఏళ్ల మహిళ మృతదేహం ఉందని సమాచారం అందడంతో వెళ్లి వెలికి తీశామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 3.2 కిలోల గంజాయి పట్టివేత



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

బాన్సువాడ: బాన్సువాడ ఎక్సైజ్ పరిధిలో నలుగురి నుంచి సోమవారం 3 కిలోల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి తెలిపారు. బాన్సువాడకు చెందిన వెంకటేష్, పిట్లంకు చెందిన రాజు బాన్సువాడ ఫిష్ మార్కెట్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అక్కడి వెళ్లి వారిని పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద ఉన్న 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా మెదక్ జిల్లా మారెడ్‌కు చెందిన బాలప్ప వద్ద గంజాయి కొనుగోలు చేశామని చెప్పారని తెలిపారు. దీంతో మారెడ్ గ్రామానికి వెళ్లి బాలప్పను అదుపులోకి తీసుకొని, 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు చెప్పారు. బాలప్పను విచారించగా పిట్లంకు చెందిన ఇబ్రహీం వద్ద గంజాయి కొనుగోలు చేస్తానని చెప్పడంతో ఇబ్రహీంను అదుపులోకి తీసుకుని 2 కిలోల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు.రాజు,వెంకటేష్, బాలప్ప, ఇబ్రహీంలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై తేజస్వీని, సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



రుక్కవ్వ మృతదేహం

బాన్సువాడ రూరల్: బాన్సువాడ బస్టాండ్‌లో సోమవారం మధ్యాహ్నం బస్సు ఢీకొని రాజబోయిన రుక్కవ్వ(80) మృతి చెందింది. బాన్సువాడలోని ఆబ్కారి కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేసే రుక్కవ్వ రోజులాగే బస్టాండ్ ప్రాంగణం నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా అటువైపు వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన రుక్కవ్వను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మోపాల్: మండలంలోని కాల్పోల్‌కు చెందిన శైలజ (38) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు.. శైలజ, తన కొడుకుతో కలిసి మూడ్రోజుల క్రితం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్ప వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో శైలజ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం శైలజ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. రోడ్లపై వడ్లు ఆరబెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్కొండకు చెందిన ఒకరు..

బాల్కొండ: బాల్కొండకు చెందిన సుముకం దశరథ్(45) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతు సోమవారం మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. దశరథ్ శనివారం రాత్రి స్కూటీపై ఆర్మూర్ వైపు వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

నవీపేట: మండలంలోని పోతంగల్ శివారులో రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బుడ్డా వెంకటసుబ్బారెడ్డి(52) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వివరాలు.. వెంకటసుబ్బారెడ్డి తన అత్తగారి ఊరైన మండలంలోని కమలాపూర్‌కు వచ్చాడు. పోతంగల్ వైపు నడుచుకుంటూ వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టపోవడంతో కొన్ని రోజులుగా మనో వేధనకు గురవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

రెంజల్: మండలంలోని కందకుర్తిలో సోమవారం టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా రత్నేల్లి గ్రామానికి చెందిన దంపతులు ఇద్దరు పిల్లలతో రెంజల్ మండలం దూపల్లిలోని బంధువుల ఇంటికి వస్తున్నారు. కందకుర్తి వద్ద వీరి బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో మహిళకు, ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. స్థానికులు టిప్పర్ డ్రైవర్‌ను పట్టుకుని చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు టిప్పర్‌ను డ్రైవర్‌తో పాటు స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టు వద్ద సోమవారం రెండు వాహనాలన నుంచి డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మెదక్ పట్టణానికి చెందిన హుస్సైన్ వాహనం నుంచి రూ.2.10 లక్షలు, సికింద్రాబాద్‌కు చెందిన దేవానందరెడ్డి నుంచి రూ.71వేలు స్వాధీనం చేసుకుని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

మోపాల్‌లో..

మోపాల్: మోపాల్ చౌరస్తాలో అదేగ్రామానికి చెందిన షేక్ సలీం నుంచి రూ.2,16,730 నగదును పట్టుకున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ట్రెజరీ కార్యాలయంలో జమ చేసినట్లు పేర్కొన్నారు.

బైక్ చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్‌కు చెందిన బేపారి సాయికుమార్ బైక్ చోరీకి గురైంది. బాన్సువాడలోని జ్యోతిక రెస్టారెంట్ ఎదుట నిలిపిన బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సోమవారం ఫిర్యాదు చేశాడని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి రెస్టారెంట్ వద్ద బైక్ నిలిపి ఫుడ్ పార్శిల్ తీసుకుని వచ్చి చూసే సరికి ద్విచక్ర వాహనం మాయమైందన్నారు.